# ముత్తైదువ!

న్యాయపతి కమలారాంజి

గోదావరి పుష్కరాలు జరుగుతున్నాయి. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా అఖండజ్యోతిలా నిలిచి వుండేది మన సంస్కృతి. సంస్కృతి సాగరం గోదావరి పుష్కరం అంటారు. 2003 సం॥ జులై 30వ తేది నుండి ఆగస్టు 10వ తేది వరకు పుష్కరాలు బ్రమ్మాండంగా కొనసాగాయి.

నుదుట విభూది రేఖలు, గుండ్రని కుంకుమ బొట్టు, పెట్టుకుని పట్టుబట్టలు కట్టుకుని, మెడలో రుద్రాక్షమాల, బంగారు గొలుసు, రెండు చేతులకీ బంగారు ఉంగరాలు ధరించి బ్రాహ్మణోత్తములు అసంఖ్యాకమైన ఆ జనం మధ్య అటు-ఇటు తిరుగుతున్నారు. వచ్చిన భక్తులు కొంతమంది చల్లటి గోదావరి తల్లిని స్మరించుకుంటూ నీళ్లల్లో మునిగి తేలుతూ ముక్కు మూసుకుని ముమ్మారు మునక వేసి తీస్తున్నారు.

గలగలా పారుతూ, బిలబిలా సాగుతూ ఉత్సాహం ఉరకలు వెయ్యగా వుప్పొంగి వురుకుతోంది గోదావరి. ఆ నదీమ తల్లి ఒడిలో సేద తీరి పైకి రావాలని, వాత్సల్యంతో ఆమె తమను అక్కున చేర్చుకుంటే మురిసిపోయి తరించాలని భక్తులందరూ తపన పడుతున్నారు.

పుష్కరాలకి లక్షల సంఖ్యలో జనం వస్తున్నారు. మొదటిరోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగారు వచ్చి గోదావరి నదిలో మూడు మునకలు వేసారు. ఆతని వెనక రాజకీయ జనం, బాడీగార్డులు, సెక్యూరిటీ వాళ్లు, శ్రేయోభిలాషులు... చాలా మందే వున్నారు. నాలుగు గంటలపాటు అటు వైపు భక్తుల రాకపోకలు కొంతవరకు స్థంభించిపోయేయి.

రాజేశ్వరి, చూడామణి, చంద్రిక, హర్షిత, శ్రీనివాసరావు అందరూ కాకినాడ నుండి రాజమండ్రికి కారులో బయలుదేరేరు. వాళ్లతో పాటే పెద్దావిడ వసుంధరగారు కూడా వస్తానంటూ వెంటపడ్డారు.

“మీరు నడవలేరు మామ్మగారూ! అక్కడ చాలా తొక్కిసలాటగా వుంటుంది. ఆ జనంలో మీరు తప్పిపోయేరంటే మిమ్మల్ని వెతకడం చాలా కష్టం. పైగా ఈ వయసులో ఎవరైనా కంగారులో తోసేసారనుకోండి మీరు ముందుకు తూలి పడి పోతారు. దెబ్బలు తగుల్తాయి. నా మాటలు విని వుండిపోండి” అని చూడామణి ఎంతో నచ్చ జెప్పింది. అయినా వినలేదు.

“ఇప్పటికే నాకు ఐదేళ్లు నిండిపోయేయి. మళ్లీ పన్నెండేళ్లకి వచ్చే పుష్కరాలని నేను చూస్తానో లేదోనే. ఒక్కసారి ఆ గోదావరిలో నన్ను మునగనియ్యండర్రా. ఈ నదీమ తల్లిని ముట్టుకుంటేనే పుణ్యం వస్తుంది! మిమ్మల్నేవర్నీ ఇబ్బంది పెట్టను లెండి. ఎంత దూరమైనా నేను నడుస్తాను లే”. అన్నారావిడ అందరికీ భరోసా ఇస్తూ. చేసేదిలేక సరే అన్నారు.

పోలీసులు అల్లంత దూరంలోనే కార్లని ఆపేసేరు. కారులో బయలు దురుటప్పుడే ధవళేశ్వరం పంచాయితీలో కాటన్ మ్యూజియమ్ పక్కన దొర నిలువెత్తు విగ్రహం వుంది. గోదావరి ఆనకట్ట నిర్మించిన కాటన్ దొరని మన ఆంధ్రులెవ్వరూ మర్చిపోరు. రాజమండ్రి దాటేక గోదావరి ఏడు పాయలుగా విడిపోయింది. గౌతమి, వసిష్ట, వృద్ధ గౌతమి, వైనతేయ... మొదలైనవి. కరీంనగర్ జిల్లా కాళేశ్వరం నించి ధవళేశ్వరం దాకా అంతర్వేది అది! అవన్నీ చూసుకుంటూ వచ్చేరు వాళ్లు!

నీళ్లలో దిగినప్పుడు ఆ నీటి ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా వెదురు దుంగలతో తయారు చేసిన పోల్స్, అడ్డంగా పెట్టేరు. (Barricating) వాళ్లంతా కారులోనే చెప్పులు వదిలేసేరు. నది వొడ్డునే కారు ఆపొచ్చని ఎవరో అంటే దిగిపోయేరు. చెప్పుల్లేకుండా చాలా దూరం నడవాల్సి వచ్చింది. ఎండ తీవ్రంగా వుంది.అంత మంచి ఎండలోనూ వసుంధర గారు మాత్రం చకచక అడుగులు వేసుకుంటూ ముందుకు నడుస్తున్నారు. మిగిలిన వాళ్లు ఆపసోపాలు పడుతూ నడవసాగారు. చంద్రికకి అలవాటు లేక అంత దూరం నడిచేసరికి అరిపాదాలు పొక్కులు ఎక్కిపోయేయి.

“మామ్మగార్ని చూడండి. ఎంత గబగబా నడుస్తోందో! ఎలాంటి ఆయాసం లేకుండా!? ఆ జనరేషన్ వాళ్లని చూసి మనం ఎన్నో నేర్చుకోవాలి.” అంది చూడామణి చంద్రికతో.

మొత్తానికి అందరూ అఖండ గోదావరి ఒడ్డుకి చేరుకున్నారు. గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. కొంతమంది భక్తులు బ్రాహ్మణుల్ని మాట్లాడుకొని పిండ ప్రదానాలు చేయిస్తున్నారు. మరి కొంతమంది నవగ్రహ దోష పరిహారార్థం పూజలు చేయిస్తున్నారు. కొంతమంది వస్త్రదానం, సువర్ణదానం, ఇంకా అన్ని రకాల దానాలు చేస్తున్నారు. చూడామణి, శ్రీనివాస్‌లు సరిగంగ స్నానాలు ఆచరించడానికి నీళ్లలోకి దిగి కొంచెం ముందుకు వెళ్లేరు. ఆమెకి నీళ్లలోకి దిగడం అంటే భయం. అసలు అంత వుధృతంగా వున్న నీటి ప్రవాహం చూస్తేనే హడల్. భర్త చేయిపట్టుకుని మెల్లగా దిగింది. ఆమె చీర తేలిగ్గా అయిపోయి ఒక్కసారిగా నీటి మీద పరుచుకుపోయింది. నీటి అడుగున వున్న చేపపిల్లలు ఆమె చీరలోపల దూరిపోయి కితకితలు పెట్టేయి. ఆమెకు ఒక్కసారిగి భయం కంగారు ఆవరించాయి. వళ్లు జలదరించింది.

“ఏవండీ! లంగా లోపల చేపపిల్లలు దూరేయి. మనం బ్రాహ్మల్లం కదా. అవి ఎలా ముట్టుకోవడమండీ. ఛీ, పాడు!” భర్త చెవిలో

గుసగుసగా అంది. శ్రీనివాస్ విసుక్కున్నాడు.

"ఖర్మ. ఖర్మ. ఎక్కడికి వెళ్లినా ఏదో ఒక వెధవ సమస్యలే తెచ్చిపెడతావు. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. నాకు చెప్పకు అందరూ ఇటే చూస్తున్నారు." అన్నాడు కసురుతున్నట్టుగా. వాళ్లు కుదుర్చుకున్న బ్రాహ్మణుడు కూడా వాళ్లతో పాటే నీళ్లలో దిగి వాళ్లిద్దరూ సరిగంగ స్నానాలు ఆచరిస్తూంటే మంత్రాలు చదవడం మొదలెట్టేడు. ఎలాగో సరిగంగ స్నానం అయినందని పించి కష్టపడి బయటపడింది. అయినా ఆమెలో యింకా భయం. అనుమానం పోలేదు. చీర మాటి మాటికీ దులుపుకుంటూనే వుంది!

ఎవరో ఒకతను పక్కనున్న బ్రాహ్మణుడ్ని అడగుతున్నాడు. "ఈ మధ్య మా అమ్మపోయింది. ఆవిడ పునిస్త్రీగా పోయింది. కాబట్టి ఆవిడ పేరు మీద ఎవరైనా పునిస్త్రీ ముత్తైదువుకి చీర, జాకట్టు, పసుపు, కుంకుమ ఇవ్వాలి. కుదురుతుందా." అని.

"కుదరకేం బాబూ! నిక్షేపంలా కుదురుతుంది. నాకు బాగా తెల్సిన ఒక పునిస్త్రీ ముత్తైదువు వుంది. పిలుస్తాను. ఆవిడ ఇక్కడే వుంది. వచ్చేస్తుంది. ఈ లోగా పూజా కార్యక్రమానిక్కావల్సిన సరంజామా అంతా సిద్ధం చేసుకుంటాను." అంటూ ఎవరో కుర్రాడికి ఏదో చెప్పి పంపించేడు. ఆ బ్రాహ్మణ పండితుడు.

ఐదు నిముషాల్లో ఒక నిండు ముత్తైదువు నుదుట నయాపైసంత బొట్టు పెట్టుకుని, కళ్లకి కాటుక పెట్టుకుని, రెండు చేతులకి ఎర్రటి మట్టిగాజులు వేసుకుని, ఎర్రటి నేతచీర కట్టుకుని అతి వినయంగా, నెమ్మదిగా వచ్చి కూర్చుంది. ఆమెను చూస్తే పార్వతీదేవి పేద ముత్తైదువు రూపంలో వచ్చి అక్కడ కూర్చున్నట్టుగా అనిపించింది! పూజా తతంగం జరుగుతున్నాది. పండితుడు మంత్రాలు వల్లె వేస్తున్నాడు. ఆ వచ్చినతను, అతని భార్య భక్తి ప్రపత్తులతో ఆ ముత్తైదువుకి పసుపు, కుంకుమ, చీర, రవికెల గుడ్డ, పువ్వులు, గాజులు, వెండి కుంకుమ భరిణె, కాటుక డబ్బీ, పండ్లు ఐదువందల పదహార్లు రూపాయలు అన్నీ సమర్పించి ఆవిడ కాళ్లకి దండం పెట్టేరు.

సరిగ్గా అప్పుడే చూడామణి ఆవిడ వైపు అనుకోకుండా చూసింది. అంతే! చూసీ చూడగానే గతుక్కుమంది చూడామణి. ఏం చెయ్యాలో పాలు పోలేదు!

"అమ్మా! నిండు ముత్తైదువువి. వాళ్లిద్దర్నీ ఆయురారోగ్య అష్ట ఐశ్వర్యాలు కలగాలని, సంతానాభివృద్ధి కలగాలని మనసారా దీవించు తల్లీ!" అన్నాడు పండితుడు.

అప్పటికే వాళ్లిచ్చిన సంభావనలు, కానుకలు, భారీగా ఇచ్చిన దక్షిణ అన్నీ చూసుకుని మురిసి పోతున్నాది ఆమె!

"అలాగేనండీ. రండి బాబూ! కాళ్లకి దండం పెట్టండి. అక్షింతలు వేసి ఆశీర్వదిస్తాను." అంది నవ్వుతూ

ఆ తతంగం అంతా అయిపోయి ఆమె లేచిం దాకా చూడామణి శిలా ప్రతిమలా అలా చూస్తుండి పోయింది...

అప్పుడు ఆమె ఇటు చూసి షాక్ తిన్న దానిలా నిల్చుండిపోయింది. "సు...మి...త్రా!" చూడామణి నోటివెంట వెలువడ్డాయి ఆ అక్షరాలు. ఆమె రెండు చేతులూ ఎత్తి చూడామణిని వైపు దీనంగా చూసి దండం పెట్టింది. ఆ నమస్కారంలో ఎన్నో అర్థాలు!?!

దీనంగా ముఖం పెట్టి చూడామణిని చూడ సాగింది.

ఆ చూపులో ఏదో భావం గోచరించింది.

"నా గురించి "నిజం" చెప్పకండి ఎవరి తోనూ... దయచేసి" అన్నట్టుంది ఆ చూపు.

"రండి. కొంచెం దూరంగా వెళ్లి మాట్లాడు కుందాం." అంది

సుమిత్ర ముందుకు దారితీస్తూ, ఇద్దరూ రద్దీ లేనిచోట నించున్నారు.

"సుమిత్రా! ఏంటిది? నీ మొగుడు పోయి ఏడాది అవలేదు ఇంకా! నువ్వు పునిస్త్రీ ముత్తైదువు కావని నాకు తెలుసు.మరి ఇదంతా ఏమిటి? ఇలా జనాలను మోసం చెయ్యొచ్చా? నిన్ను ఆ భగవంతుడు క్షమిస్తాడా?" కాస్త మందలింపుగా అంది చూడామణి.

"క్షమించండి. నేను చేస్తున్నది తప్పు అని నాకు తెలుసు. ప్రతీ మనిషికీ మనస్సాక్షి అనేది ఒకటి వుంటుంది. ఆ మనస్సాక్షిని చంపేసుకుంటే మనం ముందుకు సాగగలం? అనే నేననుకున్నాను. ఇది తప్పా? మరో గత్యంతరం లేక ఇలా చెయ్యవల్సి వచ్చింది. నా మొగుడు... వాడు వున్నా ఒకటే... లేకపోయినా ఒకటే! అలాంటి వాడికి పెళ్లాన్ని అని చెప్పుకుందికే నాకు అసహ్యంగా వుంది. అతను బతికున్నప్పుడు నన్ను చంపుకు తిన్నాడు. ఇప్పుడు చచ్చిపోయి నన్ను బ్రతికించేడు! అతను వున్న రోజుల్లో రోజూ తప్పతాగి ఏ అర్ధరాత్రికో ఇంటికి వచ్చేవాడు. మీ వీధిలోనే ఉండేవాళ్లం. మీ కంతా తెలుసు. అన్నింటికీ అనుమానమే. ఎంత సర్దుకుపోదామన్నా రోజూ ఏదో ఒక నస!

"వాడినెందుకు చూసేవు? వీడితో ఎందుకు మాట్లాడేవు? నేను లేనప్పుడు ఎవడైనా వచ్చి నీపక్కన పడుకున్నాడా? వాడితో సుఖం ఎలా వుంది నీకు? కొంపతీసి వాడితోనే కంటిన్యూ అయిపోతావా?..." మాటలు కావు అవి ఈటెలు! చప్పుడు చెయ్యని బాణాలు, అవి గుండెకు గుచ్చుకున్నా ఆ గుండె చప్పుడు ఎవరికీ వినబడదు!

"భార్యకు భర్తే సర్వస్వం. భర్త ఎన్ని మాటలన్నా భార్య కిక్కురుమన కుండా పడి వుండాలి. భర్త అనకపోతే మరెవరు అంటారు అని సరిపెట్టు కోవాలి. భర్త తిట్టినా-కొట్టినా ఏదో కోపంతో అలా అని వుంటాడు లే అని నోరెత్తకుండా సర్దుకుపోవాలి!" అనుకునే మనస్తత్వం గల సాంప్రదాయ కుటుంబం లోంచి వచ్చేను నేను. కాని రోజూ తాగొచ్చి నా వళ్లు హూనం చేసేవాడు. అతని మోటు సరసం-మోటు హాస్యాలు భరించలేకపోయేను. నా శీలాన్ని శంకిస్తున్న అలాంటి దుర్మార్గుడ్ని నేనెందుకు భరించాలి అనిపించేది!

ఆ రోజు- తాగకుండా ఇంటికి వచ్చేడు. మారేడేమో అని సంతోషించేను. కాని వెంట తన తాగుడు సరంజామా అంతా తెచ్చుకున్నాడు.

"పిల్లలు నిద్రపోయేరా?" అని అడిగేడు కన్ను గీటుతూ. నాకు అసహ్యం వేసింది. తనే స్వయంగా వెళ్లి పిల్లల నిద్రపోయేరని నిర్ధారించుకుని వచ్చేడు

"ఇవాళ మనం డాబా మీద! వెళదాం. నాకోసం అక్కడ అన్నీ ఎరేంజ్ చెయ్యి" అన్నాడు వెకిలిగా నవ్వుతూ నాకు అతని చేష్టలు చూస్తుంటే వళ్ల



మార్కాపురం సాహితీవేదిక నెలనెలా వెన్నెల, వింగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాధన డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మే 2న నిర్వహించిన రెక్కల సెమినార్‌లో మోపిదేవి రాధాకృష్ణ రచించిన 'కాంతికెరటాలు' రెక్కలు సంపుటాన్ని ఆవిష్కరిస్తున్న ఒరుగంటి మల్లిక్. చిత్రంలో మాకినీడు సూర్యభాస్కర్, పొన్నూరి వెంకట శ్రీనివాస్, మోపిదేవి రాధాకృష్ణ, ఒరుగంటి మల్లిక్, అద్దేపల్లి రామమోహనరావు, బి.హనుమారెడ్డి, కలిమిశ్రీ

మండిపోతున్నది. మిక్చర్, చేగోడీలు పక్కన ప్లేటులో పెట్టుకున్నాడు. తాగుతూ తింటూ ఎంజాయ్ చేస్తున్నాడు. పూటుగా తాగేసినించున్నాడు కిందకు దిగుదామని. సరిగ్గా ఆ టైముకి కరెంట్ పోయింది. మెట్లవైపు దిగుదామని తాగిన మైకంలో పిట్టగోడ లేని వైపు దిగేడు. అంతే. నాలుగో అంతస్థు నించి కిందపడ్డాడు. ఆ పడ్డం అక్కడే వున్న బండరాయికి తల తగలడంతో తల బ్రద్దలై నెత్తురు మడుగు కట్టింది. హాస్పిటల్‌కి తీసుకెళ్తే డాక్టరు ప్రాణం పోయిందని చెప్పేరు. అపుంపడు మీరందరూ వచ్చి చేసేరు. ఏడుద్దామంటే నాకు కళ్లంట నీళ్లు రాలేదు. నా కన్నీళ్లు ఎప్పుడో ఇంకిపోయేయి. అప్పుడు పిల్లలతో నేను వీధిన పడ్డాను!

కడుపుకింత అన్నం పెట్టేవాళ్లు కరువైయ్యారు! పిల్లల్ని పెంచాలి! వాళ్ల కడుపులు నింపాలి. ప్రతీరోజూ పేపర్లో వార్తలు చూస్తున్నాం.

"పిల్లల్ని పోషించలేక పిల్లలకి విషం ఇచ్చి తనూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్న ఒక ఇల్లాలు!" అన్న హెడ్డింగులు ఎన్నో చూసేను.

ఆఖరికి పాచిపని చేద్దామన్నా, వంటపని చేద్దామన్నా మగాళ్ల ఆకలి చూపులు తట్టుకోలేక ఎన్నో రోజులు మేం వుపవాసాలు వున్నాం. పిల్లలు ఆకలితో మలమల మాడిపోయేరు. నేను చదువుకోలేదు. ఆఖరికి ఎవరో చెప్పేరు. "రాజమండ్రి అన్నిటికీ చవక. అక్కడ ఇళ్ల అద్దెలు, కూరగాయలు, పాలు, బట్టలు... అన్నిటికీ చవకే. అని ఇక్కడికి వచ్చేను. రోజూ గోదావరి ఒడ్డున కూర్చునేదాన్ని. పూజలు-పునస్కారాలు జరిగినప్పుడు ముత్తైదువులకి బొట్టు పెట్టి పసుపు కుంకుమ, సంభావనలు ఇచ్చేవారు. నాకు ఏదో చిన్న ఆశ చిగురించింది.

"పోయిన మొగుడు పోయాడు. ఆ మొగుడు కట్టిన తాళి తీసేస్తే పోతుంది. పుట్టిన దగ్గర్నుంచి వున్న బొట్టు, పువ్వులు, గాజులు, కాటుక ఇవన్నీ ఎందుకు తీసెయ్యాలి.. అనుకున్నాను. అంతే! బ్రతకాలంటే ఏదో ఒకదారి ఎంచుకోవాలి. తప్పదు!... ఇహ ఆ రోజు నుంచి బొట్టు, కాటుక పెట్టుకొని, తల్లో పువ్వులు, చేతులకి గాజులు వేసుకొని చక్కగా పునిస్త్రీ ముత్తయిదువులాగ తయారయ్యేను. ఇక్కడ నన్ను చూసిన వాళ్లు ఎవరూ లేరు! నన్ను పోల్చి పలకరించిన వాళ్లు అసలే లేరు! అందుకే ఇక్కడ ఈ విధంగా రోజులు గడిపేస్తున్నాను. కడుపుకి జరక్క కడుపున పుట్టిన పిల్లల్ని అమానుషంగా చంపుకోలేక ఇలా చెయ్యాల్సి వచ్చింది! ఎంతో మంది చేస్తున్న ఎన్నో అన్యాయాలు కంటే నేను చేస్తున్నది పెద్ద అన్యాయం కాదనిపించింది..." వెక్కి వెక్కి ఏడుస్తోంది... సుమిత్ర!

చూడామణి మాట్లాడకుండా ఆమె చేతిలో వెయ్యి రూపాయల నోటు వుంచి అక్కడ్నుంచి భారంగా కదిలింది!!!

## ☺ హాస్య చినుకులు ☺

సూర్యకాంతాన్ని పరీక్ష చేశాక ఆవిడ భర్తతో ఇలా అన్నాడు డాక్టర్. 'మీ ఆవాడకి వినిపించకపోవడానికి పెద్ద కారణం లేదు. వయసు పెరుగుతున్నప్పుడు ఇలాంటివి మామూలే అని ఆవిడకి చెప్పండి'.

అమ్మో..! అదేదో మీరే చెప్పండి.. ఓమ్మో...! అన్నాడు భర్త.

☺ ☺ ☺

'మా తమ్ముడికి రెండేళ్ళు నిండి మూడో ఏడు వస్తోంది. వాడు చిన్నచిన్న మాటలు చెబుతుంటే మా అమ్మ ఇంకా చెప్పమంటోందిరా! అన్నాడు హరితో గిరి.

'ఆ...! మొదట్లో ఇలాగే మాట్లాడమని పీక్కుతింటారు. ఆ తర్వాత మాట్లాడితే చావకొడతారు...' అన్నాడు హరి.

☺ ☺ ☺

'మీరు నలుగురున్నారు. ఒక్క దొంగను పట్టుకోలేకపోయారా' అరిచాడు ఎస్.ఐ. పోలీసులపై.

'వాడు పారిపోయినా, వాడి వేలిముద్రలు మాత్రం సంపాదించగలిగాము' 'సరే... సరే..అవైనా ఎక్కడున్నాయో చూపించి తగలడండీ...'

'ఇవిగోసార్...! నా చెంపమీద భద్రంగా ఉన్నాయి'.

☺ ☺ ☺

'చిట్టీ...! నువ్వు బావను పెళ్లి చేసుకుంటావా...?'

'చేసుకుంటాను కాని డాడీ...! బావ పరమనాస్తికుడు, దేవుడు, దెయ్యం, స్వర్గం, నరకం ఇలాంటివి ఏమీ లేవంటాడు ఎలా...?'

'డోంట్ వర్రీ చిట్టీ... నిన్ను చేసుకున్నాక ఖచ్చితంగా అవన్నీ ఉన్నాయంటాడు...?

☺ ☺ ☺

'నిన్న నేను నాన్న దగ్గర పడుకుంటాను...' అన్నాడు కిట్టు.

'కాదు... నిన్న నేను నాన్న దగ్గర పడుకున్నాను...' అంది టీచర్ వ్యాక్యాన్ని సరిచేస్తూ.

'బహుశా నేను పడుకున్నాక, పడుకొని ఉంటారు...' అన్నాడు కిట్టు.

☺ ☺ ☺

కుటుంబరావు: ఏమిటీ నీకు పదిమంది పిల్లలా?

కుచేలరావు: ఏం చెయ్యమంటావుమరి, ఆపరేషన్ నువ్వు చేయించుకో అంటే నువ్వు చేయించుకో అని మా ఆవిడ నేను వాదించుకుంటూ ఒక నిర్ణయానికి వచ్చేసరికి లేటయ్యింది.

☺ ☺ ☺

రంగడు: సార్! మా దొంగల ఫొటో లిస్ట్ ఉంటే ఇవ్వండి.

ఎస్.ఐ.: ఎందుకు?

రంగడు: మా అమ్మాయికి పెళ్లి చేయాలి. మంచి దొంగని చూద్దామని.

☺ ☺ ☺

సుబ్బారావు: అదృష్టవంతుడివిరా నీకు చెముడు. మీ ఆవిడ తిట్టినా వినబడదు!

అప్పారావు: అదృష్టమా పాడా! తను తిట్టే తిట్లు నాకు వినబడడం లేదని తంతుందిరా!

☺ ☺ ☺

తల్లి: ఏరా చెల్లెలు ముక్కు కొరికావట, తప్పు కదూ!

నాని: లేదమ్మా... దాని ముక్కు అదే కొరుక్కుంది!

- వై.కె.మూర్తి